## సీఐ డానియల్‌పై బదిలీ వేటు

- మహిళను ట్రాప్ చేసిన ఘటనలో శాఖాపరమైన చర్యలు

నీలగిరి, డిసెంబర్ 19 : భార్యాభర్తల మధ్య తలెత్తిన ఆస్తి తగాదాలో జోక్యం చేసుకుని మహిళను ట్రాప్ చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నల్లగొండ టూటౌన్ సీఐ డానియల్ కుమార్‌ను మల్టీజోన్ 2కు అటాచ్ చేశారు. ఈ మేరకు ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చేపట్టిన విచారణ చేపట్టిన అనంతరం చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ పేర్కొన్నారు. డానియల్ స్థానంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మరోవైపు నల్లగొండ జిల్లాలో గురువారం ఏడుగురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న ఏ సైదిరెడ్డిని మిర్యాలగూడ వన్‌టౌన్‌కు, అక్కడ ఉన్న బి.సుధీర్‌కుమార్‌ను వీఆర్‌కు, సీసీఎస్‌తోపాటు వన్‌టౌన్‌లో ఉన్న యు.సురేశ్‌ను నకిరేకల్‌కు, వీఆర్‌లో ఉన్న పీఎస్ సీహెచ్ వెంకటేశ్వర్లును మిర్యాలగూడ రూరల్‌కు, మిర్యాలగూడ వన్‌టౌన్‌లో ఉన్న బి.రాంబాబును వీఆర్‌కు, డీటీసీలో ఉన్న సీహెచ్ వెంకటేశ్వర్లును మిర్యాలగూడ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓగా, మిర్యాలగూడ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ బి,మోహన్‌బాబును వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



సర్వేల్ గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

# రుణమాఫీ డబ్బులేవి



## నాలుగో విడుత లబ్ధిదారుల ఖాతాలో జమ కాని నగదు

## 20 రోజులు గడుస్తున్నా తప్పని ఎదురుచూపులు

- బ్యాంకుల చుట్టూ జాబితాలోని రైతుల ప్రదక్షిణలు
- లబ్ధిదారుల సంఖ్యను కుదించేందుకు ప్రభుత్వ కుట్ర
- ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారుల గుర్తింపునకు సర్వే
- సర్వే పూర్తైై కుదింపు జాబితా వస్తేనే మాఫీ వర్తింపు?
- అప్పటివరకు లబ్ధిదారులకు నిరీక్షణే
- సర్కారు తీరుపై మండిపడుతున్న అన్నదాతలు
- మిగిలిన రుణమాఫీ సంగతి ప్రశ్నార్థకం?

నాలుగో విడుత రుణమాఫీ అంటూ రైతుల పేర్లతో విడుదల చేసిన లబ్ధిదారుల జాబితాపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా గొప్పల కోసం మరో విడుత రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. వ్యవసాయ శాఖ నుంచి లబ్ధిదారుల జాబితాలు, వాటికి సంబంధించిన డబ్బు మొత్తం ఎంతో కూడా అదే సమయంలో అట్టహాసంగా ప్రకటించారు. దాంతో వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న రుణమాఫీ లబ్ధిదారుల్లో కొందరు ఆలస్యమైనా రుణమాఫీ వచ్చిందని ఊపిరి పీల్చుకున్నారు. రెండు, మూడ్రోజుల్లో తమ ఖాతాల్లో మాఫీ డబ్బులు జమ అవుతాయని ఆశ పడ్డారు. కానీ వీరి ఆశలు నేటికీ నెరవేరలేదు. నాలుగో విడుదల రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేసి 20 రోజులు గడుస్తున్నా నేటికీ ఒక్క రైతుకూ ఒక్క రూపాయి కూడా రుణమాఫీ కాలేదు. పైగా ఆర్థిక భారం తప్పించుకునేందుకు లబ్ధిదారుల జాబితాను కుదించేందుకు ప్రభుత్వం రహస్యంగా సర్వే చేస్తున్నట్లు తెలిసింది. దాంతో సీఎం ప్రకటనకు, ఆ వెంటనే వెలువడిన జాబితాకే దిక్కు లేకపోతే ఎలా అని రైతులు మండిపడుతున్నారు.

– నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్19(నమస్తే తెలంగాణ)

కాంగ్రెస్ ప్రభుత్వం జూలై నుంచి మొదలుపెట్టిన రుణమాఫీ పథకం అంతులేని కథగా కొనసాగుతూనే ఉంది. ఆగస్టు 15 నాటికి మూడు విడుతలుగా రుణమాఫీ చేయగా, ఉమ్మడి జిల్లాలో ఇంకా సుమారు రెండున్నర లక్షల మంది అర్హులైన రైతులు మిగిలి ఉన్నారు. రేషన్ కార్డును ప్రమాణీకం తీసుకోవడంతోపాటు రేషన్ కార్డు లేకపోవడం, పేర్లు, ఆధార్ నెంబర్లు, పట్టాదార్ పాస్ పుస్తకాల నెంబర్ల నమోదులో తప్పిదాల పేరుతో వీరిని పక్కన పెట్టేశారు. దాంతో మిగిలిన రైతులంతా నిత్యం ఆందోళనలకు దిగడంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. ఈ నేపథ్యంలోనే గత నెల 30న నాలుగో విడుత రుణమాఫీ పేరుతో ప్రభుత్వం ప్రకటన చేసింది. జిల్లాల వారీగా రేషన్ కార్డు లేని 2 లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతుల పేర్లతో జాబితాలు విడుదల చేస్తూ మాఫీ మొత్తాన్ని ప్రకటించింది. నాలుగో విడుతలో నల్లగొండ జిల్లాలో 21,432 మంది రైతులకు గానూ రూ.236.90 కోట్ల రుణాలను, సూర్యాపేట జిల్లాలో 15,009 మంది రైతులకు గానూ రూ.132 కోట్ల రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఇదే విషయాన్ని ఈ నెల 7న నల్లగొండలో జరిగిన విజయోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి గొప్పగా ప్రకటించారు. దాంతో జాబితాలో ఉన్న నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన 36,441 మంది రైతులు రుణమాఫీ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదిగో.. అదిగో అనడమే తప్ప నేటికీ ఒక్క రూపాయి కూడా రైతుల అకౌంట్లలో జమ కాలేదు. అంటే, ప్రభుత్వమే ఇప్పటికీ ఒక్క పైసా కూడా నాలుగో విడత రుణమాఫీ కోసం విడుదల చేయలేదన్న మాట. సీఎం రేవంత్‌రెడ్డి మాటలతో రైతులంతా 20 రోజులుగా బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఎవ్వరూ కూడా రైతుల గోడును పట్టించుకునే పరిస్థితి లేదు. అధికారులు కూడా నోరు మెదపడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే మీ అకౌంట్లలో మాఫీ డబ్బులు జమ అవుతాయని మాత్రమే చెప్తున్నారు. అవి ఎప్పుడు వస్తాయనే దానిపై మాత్రం ఎవ్వరూ స్పందించడం లేదు. నిత్యం రైతులు వచ్చి వ్యవసాయ అధికారులు, బ్యాంకు సిబ్బందిని ప్రశ్నిస్తుంటే వాళ్లు విసుక్కుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి.

### లబ్ధిదారుల సంఖ్య కుదింపునకు ఆదేశాలు

మొదటి నుంచీ లబ్ధిదారుల సంఖ్యను ఎంత వీలైతే అంతలా కుదించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే నాలుగో విడుతపైనా ప్రభుత్వం కన్నేసింది. విజయోత్సవాల్లో ప్రకటించిన జాబితాకు కత్తెర వేసేందుకు ఆదేశాలు ఇచ్చింది. ఈ జాబితాలోని లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు రహస్య సర్వే చేస్తున్నట్లు తెలిసింది. ఈ జాబితాలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నా లేదా ఆదాయపు పన్ను చెల్లింపుదారులు ఉన్నా సరే వారందరినీ గుర్తించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను ట్రెజరీ కార్యాలయాల ద్వారా సేకరిస్తుండగా, ఐటీ చెల్లింపుదారులను సంబంధిత శాఖ ద్వారా గుర్తించే పనిని చేపట్టారు. ఈ తొలగింపు పనిని వ్యవసాయ శాఖ ద్వారా చేపట్టాలని ముందుగా భావించినా వారూ క్షేత్రస్థాయి పరిస్థితుల నేపథ్యంలో దీనికి ససేమిరా అన్నట్లు తెలిసింది. జాబితాల నుంచి తొలిగిస్తే స్థానికంగా రైతుల నుంచి తాము ఇబ్బందులు పడుతామని చెప్పడంతో వేరే విభాగాల ద్వారా ఏరివేత ప్రక్రియను వేగవంతం చేసినట్లు సమాచారం. ఇది పూర్తయ్యాకే నాలుకో విడత రుణమాఫీపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తున్నది.



రుణమాఫీ నగదు జమ కాకపోవడంతో వివరాలు తెలుసుకునేందుకు నల్లగొండ జేడీఏ కార్యాలయానికి వచ్చిన రైతు

### రైతుల ఆగ్రహం

నాలుగో విడత రుణమాఫీకి సంబంధించి అంతా గోప్యత పాటిస్తుండడంతో రైతులు తీవ్రంగా మండి పడుతున్నారు. దీనిపై ఏ అధికారిని అడిగినా తమకు తెలియదంటూ దాట వేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అట్టహాసంగా ఏడాది ప్రజా పాలన ఉత్సవాల్లో ప్రకటించి ఇప్పుడు ప్రజాప్రతినిధులు సైతం నోరు మెదపకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే జాబితా ప్రకారం రుణమాఫీ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక నాలుగో విడతలోని కొద్దిమంది రైతుల పరిస్థితి ఇలా ఉంటే ఇంకా మిగిలి ఉన్న రైతుల సంగతి ఏంటన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఇంకా సాంకేతిక తప్పులతోపాటు రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులంతా మాఫీ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. వారిందరికీ రుణమాఫీ జరిగేనా, లేదా? అన్నది వేచి చూడాల్సిందే.

### మొదటి విడుత నుంచి ఎదురుచూస్తున్నా



ఒకే సారి రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నది. రుణమాఫీ విషయంలో ఒక విధానం అన్నదే లేకుండా పోయింది. నేను వ్యవసాయ అవసరాల కోసం లక్షా 9వేల రూపాయలను బ్యాంకులో రుణం తీసుకున్నాను. అది మాఫీ అవుతుందని మొదటి విడుత నుంచి చూస్తూనే ఉన్నాను. ఇప్పటికీ కాలేదు. అసలు రుణ మాఫీ అవుతుందన్న నమ్మకమే పోతున్నది. పైగా బ్యాంకు వాళ్లు వడ్డీ వేస్తున్నారు. సీఎం రేవంతరెడ్డివి మాటలే తప్ప అమలు చేయడం లేదు. రుణ మాఫీ కాకపోవడం వల్ల కొత్త రుణం ఇవ్వడం లేదు. పంట పెట్టుబడికి డబ్బులు లేక ప్రైవేట్‌లో ఎక్కువ మిత్తికి అప్పులు తీసుకోవాల్సి వస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పేరుతో సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అకౌంట్‌లో జమ చేసేది. రైతుకు దేవలాట లేకుండే. కాంగ్రెస్ పాలనలో రైతుల కథ మొదటికి వచ్చింది.

**-తిప్పన ప్రతాప రెడ్డి, రైతు, సుబ్బ రెడ్డిగూడెం, మిర్యాలగూడ మండలం (మిర్యాలగూడ రూరల్)**

## కాంగ్రెస్ పాలనలో సర్వేల్ గురుకులం నిర్వీర్యం

- విద్యార్థి సంఘాల ధర్నా
- విద్యార్థి గాయపడిన ఘటనలో ప్రిన్సిపాల్ సస్పెన్షన్

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 19 : దేశంలోనే మెట్టమొదటిదైన సర్వేల్ గురుకుల పాఠశాల కాంగ్రెస్ పాలనలో నిర్వీర్యం అవుతున్నదని విద్యార్థి నాయకులు మండిపడ్డారు. తోటి విద్యార్థులకు రాగి జావ సర్వ్ చేస్తుండగా కాళ్ల మీద పడి తీవ్రంగా గాయపడిన విద్యార్థి సామెల్‌కు న్యాయం చేయలని కోతురూ వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం సర్వేల్ గురుకులం ఎదుట ఆందోళన నిర్వహించారు. బుధవారం ఉదయం ఎనిమిదో తరగతి విద్యార్థి సామేల్ తోటి విద్యార్థులకు రాగి జావ అందిస్తుండగా, గిన్నె జారి వేడివేడి జావ కాళ్ల మీద పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో గాయపడిన సామెల్‌తోపాటు మరో విద్యార్థి మదన్, వంట మనిషి బోయ ఇందిరకు న్యాయం చేయలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌తోపాటు వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, బీజేవైఎం నాయకులు గురుకులం ఎదుట ధర్నా చేశారు. సర్వేల్ గురుకుల పాఠశాలలో 650 మంది విద్యార్థులకు కేవలం నలుగురు వంట మనుషులు మాత్రమే పని చేస్తున్నారని విద్యార్థి నాయకులు తెలిపారు. దాంతో ప్రిన్సిపాల్ రోజా విద్యార్థులతోనే ఆహారం పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. గాయపడిన విద్యార్థులు, వంట మనిషికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, నిరక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని గురుకుల పాఠశాల ముందు బైటాయించారు. ఆందోళన క్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. ఆర్డీఓ వచ్చి సమస్యను పరిష్కరిస్తామని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నలపరాజు రమేశ్, రహేమన్, పల్లె మధు కృష్ణ, సుర్వి రాజు గౌడ్, దోనూరి వీరారెడ్డి పాల్గొన్నారు. కాగా, ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థికి గాయాలైనట్లు గుర్తించి గురుకుల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు.

### సామెల్‌కు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల పరామర్శ

రాగి జావ పడి తీవ్రంగా గాయపడి హైదారాబాద్‌లోని చికిత్స పొందుతున్న విద్యార్థి సామెల్‌ను మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అండగా ఉంటానని అతడికి కుటుంబానికి భరోసానిచ్చారు. తక్షణ సాయం కింద 10వేలు ఆర్థిక సాయం చేశారు. వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌తోపాటు వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని కూసుకుంట్ల డిమాండ్ చేశారు. సర్వేల్ గురుకుల పాఠశాలలో 8, 9వ తరగతి విద్యార్థులు కూడా పుస్తకం చూసి తెలుగు, ఇంగ్లిష్ చదివే పరిస్థితి లేకపోవడం గురుకుల నిర్వహణను తేటతెల్లం చేస్తున్నదన్నారు. 650 మంది విద్యార్థులు ఉంటే సరిపడా ఉపాధ్యాయులు, వంట సిబ్బంది లేరని, పీఈటీ ఒక్కరే ఉన్నారని తెలిపారు. ఆయన వెంట చండూరు మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్రి నరసింహ, బీఆర్ఎస్వీ మునుగోడు అధ్యక్షుడు రమేశ్ ఉన్నారు.



సూర్యాపేటలో కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

## అమిత్‌షా దిష్టిబొమ్మల దహనం

రామగిరి, డిసెంబర్ 19 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచేలా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడడం దుర్మార్గమని వివిధ సంఘాల నాయకులు మండిపడ్డారు. పార్లమెంట్‌లో అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా పలుచోట్ల ఆందోళనలు చేపట్టారు. నల్లగొండలో కేవీపీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. సూర్యాపేటలోని నల్లాలబావి సెంటర్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. హాలియాలోనూ కేవీపీఎస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.

## సాగర్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, డిసెంబర్ 19 : నాగార్జున సాగర్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని, ఈ కృషిని ప్రస్తుత సర్కారు ముందుకు తీసుకువెళ్లి పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. స్టేట్ టూరిజం పాలసీపై గురువారం శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా టూరిజానికి ప్రాధాన్యత పెరుగుతున్నదన్నారు. సింగపూర్, దుబాయ్ లాంటి వంటి దేశాలు టూరిజంపైనే ఆర్థిక పరిపుష్టి సాధించాయన్నారు. సాగర్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 274 ఎకరాల స్థలంలో బుద్ధవనం నిర్మాణం చేపట్టిందన్నారు. ప్రపంచ బౌద్ధమత సంస్కృతిని ప్రతిబింబించేలా ఉన్న బుద్ధవనాన్ని చూసేందుకు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారని తెలిపారు. కానీ, ఆ స్థాయిలో ఇక్కడ సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. ఆ మేరకు వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన, పర్యాటక శాఖపై ఉందన్నారు. ప్రస్తుతం సాగర్ విజయ విహార్‌లో పర్యాటకులకు సరిపోయే విధంగా గదులు లేవన్నారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో గతంలో ఎప్పుడో కాటేజీలు ఏర్పాటు చేసినా, ప్రస్తుతం అవి అధ్వానస్థితికి చేరాయన్నారు. పర్యాటకుల అభిరుచికి తగ్గట్టుగా సాగర్‌లో టూరిజం శాఖ ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రూపురేఖలు కోల్పోయిన నెహ్రూ పార్కుతోపాటు సాగర్‌కు నాలుగు కిలో మీటర్ల దూరంలోని రాజీవ్ టైగర్ వ్యాలీని మరింతగా అభివృద్ధి చేయాలని కోరారు.



శాసన మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

## అంబుజా పరిశ్రమపై అసెంబ్లీలో ప్రకటన చేయాలి

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రామన్నపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, డిసెంబర్19: యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేటలో ప్రజారోగ్యం, పర్యావరణాన్ని దెబ్బతీసే అదానీ గ్రూప్‌కు చెందిన అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వబోమని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. గురువారం రామన్నపేట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించి రెండు నెలలు కావస్తున్నా నేటికీ ఎలాంటి ప్రకటనా చేయకుండా ఆన్‌లైన్‌లో అనుమతులు ఇచ్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అదానీతో లోపాయికార ఒప్పందాలు కుదుర్చుకున్నారన్నారు. ఓటుకు నోటు కేసు నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఈడీ కేసు నుంచి మంత్రి పొంగులేటి బయట పడేందుకు మోదీతో కుమ్మక్కు అయ్యారని ఆరోపించారు. సోనియా, రాహుల్ గాంధీ మొట్టికాయలు వేస్తే ఫోర్త్ సిటీ కోసం అదానీ నుంచి తీసుకున్న రూ.100కోట్లు వాపస్ ఇచ్చానని ప్రకటించుకున్నాడు తప్ప లోలోపల తీసుకున్న డబ్బులకు లెక్కలేదన్నారు. రామన్నపేటలో అదానీ కొనుగోలు చేసిన భూముల చుట్టూ ఉన్న సర్వే నంబర్ 584లోని 127 ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు బదలాయించి, అటునుంచి అదానీకి అప్పగించే కుట్ర జరుగుతుందన్నారు. అక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోర్టుల నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించడం జరిగిందని, ప్రస్తుతం మరోచోట స్థల పరిశీలన ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జనావాసం మధ్య నిర్మించాలని చూస్తున్న అంబు జా సిమెంట్ ఫ్యాక్టరీకి బీఆర్ఎస్ పార్టీ పూర్తి వ్యతిరేకమన్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనేకమార్లు స్పష్టంగా చెప్పినట్లు పేర్కొన్నారు. రామన్నపేటను మరో లగచర్లగా మారక ముందే అంబుజా సిమెంట్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలు, రైతులతో కలిసి ఎలాంటి పోరాటానికైనా తాము వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, గొరిగే నర్సింహ, పున్న వెంకటేశం, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, ఎస్‌కే చాంద్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి జాడ సంతోష్ పాల్గొన్నారు.

# నత్తనడకన ఇండ్ల సర్వే



భూదాన్‌పోచంపల్లి పద్మానగర్‌కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

## నెమ్మదిగా సాగుతున్న దరఖాస్తుల పరిశీలన

- జిల్లాలో ఇప్పటివరకు 21.89శాతం మాత్రమే క్లియర్
- సర్వర్ సతాయింపులు.. నెట్‌వర్క్ సమస్యలు
- గుండాల మండలంలో మాత్రం 12.48 శాతమే..
- నెలాఖరు వరకు గడువు.. సర్వే పూర్తిపై సందేహాలు

**రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే నత్తనడకన నడుస్తున్నది. దరఖాస్తుల పరిశీలన నిర్దేశించుకున్న లక్ష్యానికి దూరంగా ఉంది. సర్వర్ సతాయింపులు, నెట్‌వర్క్ సమస్యల వంటి కారణాలతో ఆలస్యమవుతున్నదని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 31 వరకు గడువు ఉండగా, అప్పటిలోగా సగమైనా అవుతుందా.. లేదా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.**

– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ)

ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం తొలి విడతలో సొంత స్థలం ఉన్న వారికి ఇండ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల సాయం చేస్తామని ప్రకటించింది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 మంది లబ్ధిదారులను గుర్తించనుంది. గతేడాది డిసెంబర్‌లో ప్రజా పాలనలో భాగంగా వివిధ పథకాల అమలు కోసం దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 2,01,977 అప్లికేషన్లు వచ్చాయి. వారిలో అర్హులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నెల 11 నుంచి దరఖాస్తుల పరిశీలన సాగుతున్నది. జిల్లాలో 421 గ్రామపంచాయతీలతోపాటు మున్సిపాలిటీల్లో 104 వార్డుల్లో సర్వే నడుస్తున్నది. గ్రామాల్లో ఒక్క గ్రామ పంచాయతీకి కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డుకు ఒకరు అప్లికేషన్లను పరిశీలిస్తున్నారు. మొత్తంగా 630 మంది వరకు సర్వేలో పాల్గొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్వే చాలా ఆలస్యంగా సాగుతున్నది. మొత్తం దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 44,040 దరఖాస్తులు.. అంటే, 21.89 శాతం మాత్రమే క్లియర్ అయ్యాయి. అర్బన్ ప్రాంతాల్లో 47.87శాతం కాగా, అత్యధికంగా మోత్కూరు మున్సిపాలిటీలో 72.86 శాతం సర్వే పూర్తయ్యింది. మండల వారీగా పరిశీలిస్తే మొత్తంగా 17.5 శాతం మాత్రమే అయ్యింది. గుండాలలో అతి తక్కువగా 12.48 శాతమే చేశారు. ఆ తర్వాత భువనగిరి మండలంలో 13.33శాతం, వలిగొండ 13.55శాతం, అడ్డగూడూరులో 15.40శాతం, చౌటుప్పల్‌లో 15.71శాతం, ఆత్మకూర్ (ఎం)లో 15.78శాతం, రాజాపేటలో 15.90శాతం, నారాయణపురంలో 16.80 శాతం పూర్తయ్యింది. ఈ నెల 31 వరకు పూర్తి చేయాలని ఆదేశాలు ఉండగా, అప్పటిలోగా సాధ్యమయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

### సాంకేతిక సమస్యలే అధికం

సర్వే స్లోగా జరుగడానికి సాంకేతిక సమస్యలు అధికంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుదారుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. 30 నుంచి 35 ప్రశ్నల ఆధారంగా వివరాలను సేకరించి, ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలి. పెద్ద సంఖ్యలో యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తుండడంతో సర్వర్‌పై భారం పడుతున్నది. అంతేగాక గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య తీవ్రంగా ఉంది. యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒక్కో దరఖాస్తుదారు ఇంటి వద్ద గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తున్నది. కొందరు ప్రజా పాలనలో పొందుపరిచిన చిరునామాల్లో అందుబాటులో ఉండడం లేదు. ఈ క్రమంలో ఒక్కొక్కరు రోజుకు 10 నుంచి 15 దరఖాస్తులు మాత్రమే పూర్తి చేయగలుగుతున్నారు.

### సర్వే స్లోగా ఉన్న మండలాల్లో కొన్ని..

| మండలం | దరఖాస్తులు | పూర్తి |
|---|---|---|
| గుండాల | 9153 | 12.48 |
| భువనగిరి | 12,307 | 13.33 |
| వలిగొండ | 16,157 | 13.55 |
| అడ్డగూడూరు | 8195 | 15.40 |
| చౌటుప్పల్ | 11,129 | 15.71 |
| ఆత్మకూర్ (ఎం) | 8,172 | 15.82 |
| రాజాపేట | 9,991 | 15.90 |
| నారాయణపురం | 13,647 | 16.80 |